క్రోక్విల్ హాస్యప్రియ - జులై, 1984

"పీతకష్టాలు పీతకున్నట్లే వరకట్నం విషయంలో మగాడి సమస్యలు మగాడికీ ఉన్నాయి-"

# మగాళ్ళకీ వుంది..... వరకట్న సమస్య!

వరకట్నం సమస్యవల్ల పెళ్ళికాక కొందరు, పెళ్ళయ్యాక అత్తింటిబాధ భరించలేక, కొందరు ఆత్మహత్యలు చేసుకుని చచ్చిపోతున్నారని విన్నాను. జర్నలిస్టుగా ఈ విషయమై కథలు సేకరించాలని నాకు అనిపించింది. అసలైన కథలు తెలుసుకోవాలంటే గిరికొండ దగ్గరకు వెళ్ళాలి. అక్కడే ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నది.

నేను ఒక రోజంతా గిరికొండ వద్ద కాశాను, నా శ్రమ వృథా అయిందనుకోకుండా నాకో కేసు దొరికింది.

అతడు యువకుడు. మనిషి పిడుగులా ఆరోగ్యంగా ఉన్నాడు. బట్టలు కూడా మంచివే వేసుకున్నాడు. కొండమీంచి దూకబోతూంటే చివరి క్షణాల్లో నేను పట్టుకుని ఆపాను.

"నన్ను చావనివ్వండి" అన్నాడతను దిగులుగా. అతడు నాకంటే బలంగానే ఉన్నప్పటికీ నన్ను విడిపించుకునే ప్రయత్నాలు ఎక్కువగా చేయడం లేదు. బహుశా చివరి క్షణాల్లో చావంటే భయం వేసిందేమో!

"నేను జర్నలిస్టును. నీ కథ విని అప్పుడు చావనిస్తాను - నీ శవానికి ఫొటోలు తీసి నీ కథను పత్రికల్లో వేయించి నిన్ను చిరంజీవిని చేస్తాను" అన్నాను.

"నా పేరు అదే" అన్నాడా యువకుడు.

"అదే అంటే - చిరంజీవా?"

"అవునుసార్ - చిరంజీవే?"

"నాయనా - చిరంజీవీ - నువ్వు చావాలనుకునేటంత సమస్య ఏం వచ్చింది? నువ్వు నిరుద్యోగివా లేక తిండిలేని పేదవాడివా?" అనడిగాను.

"రెండూ కాదు సార్..... నాకు ఉద్యోగముంది. కడుపునిండా తినగలుగుతున్నాను.

కాన్సర్ లాంటి ఏ రోగాలు కూడా లేవు?"

"మరైతే ఎందుకు చావాలనుకున్నావు?"

"వరకట్నం సమస్య సార్....."

"వ్వాట్ - మగాడికి వరకట్నం సమస్యా?" తెల్లబోయాను.

"అదేంటి సార్ - మీకు తెలియదా - ఈ దేశంలో వరకట్నం సమస్య మగాళ్ళదేనని నేనంటాను. ఆడవాళ్ళైతే ఏముంది సార్- వాళ్ళ వాళ్ళు చేస్తే పెళ్ళి చేసుకుంటారు. లేకపోతే లేదు. కానీ మగాడి విషయం అలా కాదే- ?"

నాకిది నమ్మబుద్ధికావడం లేదు. ఈ చిరంజీవి తెలుగు మాట్లాడగలిగే ఏ ఇతర భాషస్థుడో అయుండాలనుకుని "నువ్వు తెలుగువాడివేనా?" అన్నాను.

"తెలుగువాణ్ణి, అగ్రకులస్థుడిని కూడా" అంటూ చిరంజీవి నా అనుమానాలన్నింటినీ పటాపంచలు చేశాడు.

"అయితే ఇదేమిటి?" అన్నాను.

'ఏం చెప్పనుసార్- నా ఉద్యోగం మీద వచ్చే జీతంతో గుట్టుగా సంసారం చేసుకోవడానికి వీలవుతుంది తప్పితే జల్సాలు చేసే అవకాశం లేదు."

"అంతమాత్రాన మగాడిని కట్నం అడిగేవాళ్ళుంటారా?" అనుకున్నాను.

"నా తండ్రి రిటైరై ఏడాదయింది. ఆయనకు వచ్చే పెన్షన్ డబ్బులు మా అమ్మ వైద్యానికే చాలవు. అన్నట్లు మాఅమ్మ రోగిష్టిది సార్. నాక్కాబోయే భార్య అత్తగారికి రెండుపూటలా సేవలు చేయాలి సార్"

"అయితే మాత్రం....." అనుకున్నాను.

"మా నాన్న కోపిష్టి. ఎదురు సమాధానాలాయనకు నచ్చవు. అందువల్ల వచ్చే కోడలు పరమశాంత స్వభావురాలై ఉండాలి..."

"మీ నాన్నకు కోపం లేకపోయినా ఆడపిల్లకు శాంతం ఉండాలి. లేకపోతే నీ జీవితం నరకమవుతుంది"

"వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా ఉండడం కోసం నాక్కాబోయే భార్యకు ఉద్యోగం కూడా ఉండాలి."

"మరి నీ రోగిష్టి తల్లికి సేవలెలా చేస్తుంది?" అన్నాను.

"దానికేముంది? పొద్దున్న సాయంత్రం ఇంట్లోనే ఉంటుంది గదా - అంటుంది సార్ మా అమ్మ......"

"అదీ నిజమేలే" అన్నాను కాబోయే అతడి భార్యపై మనసులోనే జాలిపడుతూ.

"నాకు స్వంతిల్లు లేదు. అద్దె ఇల్లు కూడా ఒక్కటే గది. మొదట్నించీ విశాలమైన గదిలో ఉండడం అలవాటైన కారణంగా ఆ గదిలో మా అమ్మే పడుకుంటుంది. నేను, నా భార్య ఇరుగ్గా ఉన్నా వంటింట్లోనే పడుకోవాలి."

"ఇది కొంచెం ఇబ్బందేనే" అన్నాను.

"నాకు సెంటుభూమి కూడా లేదు సార్"

"అలాంటప్పుడు నీకు పిల్లదొరకడం కష్టమే"

"నాక్కాబోయే భార్య అందంలో సినిమా హీరోయిన్లను మించిపోవాలి, అణకువలో పురాణంలో పతివ్రతలకే పాఠాలు చెప్పగలగాలి...."

"చూడు బాబూ ఇన్ని షరతులు పెడితే నీకు పెళ్ళికాదు"

చిరంజీవి విషాదంగా నవ్వి "ఇన్ని షరతులకూ ఒప్పుకుని ఎన్నో సంబంధాలు వచ్చాయి సార్ నాకు కానీ నా సమస్య వేరు...."

అప్పుడు నాకు అతడి సమస్య గుర్తుకు వచ్చింది. ఇలాంటివాడిని ఎదురు కట్నం అడగడంలో ఎంతైనా సబబు ఉన్నది - "ఊ చెప్పు" అన్నాను.

"మా అమ్మా నాన్నా నాకు నలభై వేలు కట్నం కావాలంటున్నారు సార్... లేకపోతే నాకు పెళ్ళి చేయరుట...."

నా జాలి అంతా అసహ్యంగా మారింది" మరి నువ్వేమన్నావ్?"

"నేనేమంటాను? నా పెళ్లివాళ్ళే కదా చేయాల్సింది. భార్యలేని జీవితం ఉప్పులేని పప్పు. ఎన్నాళ్ళని ఎదురుచూడను? అయిదేళ్ళు చూసి - ఇంక చావాలని ఇలా వచ్చాను"

"అయితే చావు..." అని అక్కణ్ణించి వచ్చేశాను. కానీ వరకట్నం సమస్య మగాడికీ ఉన్నదని తెలియజెప్పిన ఆ యువకుడిని అభినందించాలో, అసహ్యించుకోవాలో నాకు తెలియడం లేదు.

✦ ✦ ✦